జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 31 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 4


# విద్యార్థులను వసతి గృహాలు దాటి పోనివ్వద్దు

- ఐటీడీఏ పీవో ఆదేశాలు



**భద్రాచలం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి :** వర్షాలు అధికంగా కురుస్తున్నందున గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ, వరద తాకిడికి గురి అయ్యే పాఠశాలల పట్ల సంబంధిత హెచ్ఎం వార్డెన్ పిల్లలు బయటకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావం వలన రాష్ట్రంలో అధిక వర్షాలు కురుస్తున్నందున గిరిజన గ్రామాలలో చెరువులు, కుంటలు కాలువలు పొంగి

మిగతా 2 లో...





## తుఫాను ప్రభావిత ప్రాంతాలలో...

# అప్రమత్తంగా ఉండాలి

- వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో నేడు ఏరియల్ సర్వే నిర్వహించనున్న సీఎం
- జిల్లా కలెక్టర్లు, అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశాలు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా తుఫాను ప్రభావం ఉన్న జిల్లాల్లో ప్రభుత్వం పూర్తిస్థాయి అప్రమత్తతతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు, వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాలు సమన్వయంతో అత్యవసర చర్యలు చేపట్టాలని సీఎం జిల్లాల కలెక్టర్లను, అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి గురువారం పరిస్థితులను సమీక్షించారు. భద్రతా, సహాయక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. "వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బుధవారం జరిగే వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిపారు శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తుఫాను ప్రభావిత జిల్లాల ఇన్ చార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు అండగా నిలవాలని

మిగతా 2 లో...



# మొంథ తుపాను వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**టేకులపల్లి, అక్టోబర్30, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలంలోని తంగేళ్ల తండా గ్రామంలో గురువారం తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యక్షంగా సందర్శించి నష్టాన్ని పరిశీలించారు.ఈ సంద ర్భంగా ఆయన రైతు గాంధీకి చెందిన వరి పొలాన్ని సందర్శించి పంట పరిస్థితిని సమీక్షించారు. పొలంలో నీరు నిల్వ ఉండటం వల్ల పంట మరింత నష్టానికి గురయ్యే అవకాశం ఉన్నందున వెంటనే నీటి నిల్వను తొలగించి, వరి కోతను త్వరితగతిన చేపట్టాలని రైతులకు సూచించారు. పంట నష్టాన్ని తగ్గించుకోవడమే కాకుండా రైతుల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూడటం అత్య వసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లా డిన కలెక్టర్ పత్తి సాగు చేస్తున్న రైతులు పత్తి అనంతరం మునగ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. మునగ సాగు చేయడం ద్వారా ఇప్పటికే జిల్లాలో చాలామంది రైతులు అధిక లాభాలను ఆర్జిస్తు న్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని మునగ సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని

మిగతా 2 లో...

# సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్




**బూర్గంపహాడ్,అక్టోబర్30(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆకస్మిక తనిఖీ చేశారు.అనంతరం ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి ఓపి రూము, పేషెంట్లకు సరిపడా బెడ్లు అందుతున్న వైద్యం, మంచినీటి సౌకర్యం, వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు,

మిగతా 2 లో...



# విజిలెన్స్ నిత్య జీవితంలో భాగం కావాలి



- ప్రతి అంశాన్ని మానవీయ కోణంలో చూడాలి
- దోషులను పట్టుకోవడమే కాదు.. తప్పులను ముందుగానే నివారించాలి...
- అదే నిజమైన విజిలెన్స్
- విజిలెన్స్ అవగాహన

### వారోత్సవాల్లో విజిలెన్స్ డీజీ శిఖా గోయల్

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** ప్రతీ వ్యక్తి కేవలం వృత్తి జీవితంలోనే కాకుండా నిత్య జీవితంలోనూ నీతి, నిజాయతీల అత్యున్నత ప్రమాణాలను పాటించినప్పుడే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడమే కాకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడం సాధ్యమవుతుందని

మిగతా 2 లో...

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)

ప్రతిరోజు రోగుల సంఖ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.మండల కేంద్రానికి చుట్టుపక్క గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యం అందాలని,108 అంబులెన్స్ సౌకర్యం, సరిపడా మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండే విధంగా నిల్వ ఉంచుకోవాలని, వైద్యులు సమయపాలన పాటించి నిత్యం వైద్య వృత్తి సేవగా చేసే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా తాను బిపి మిషన్ ద్వారా పరీక్ష చేయించుకోవడం జరిగింది. అంతేకాకుండా తాను బ్లడ్ తీయించుకొని రక్త పరీక్షలు చేయించుకోవటం పట్ల రోగులకు ఎలాంటి సదుపాయాలు అందుతున్నాయో స్వయంగా పర్యవేక్షణ ద్వారా తెలుసుకున్నారు.డాక్టర్లకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు.

## మొంథ తుపాను వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్





(మొదటి పేజీ తరువాయి...)

సూచించారు. అదే విధంగా వరి సాగు చేసే రైతులు, ముఖ్యంగా బోరు సౌకర్యం ఉన్న వారు, సగం భూమిలో ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా దీర్ఘకాలికంగా అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ రైతులకు సమీకృత వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.వ్యవసాయం పట్ల సృజనాత్మక దృష్టితో ముందుకు సాగుతూ, పంటలతో పాటు కౌజు పిట్టల పెంపకం,మేకల పెంపకం, గేదెల పెంపకం,చేపల పెంపకం, కూరగాయల సాగు వంటి అనుబంధ జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతుల ఆదాయం విస్తృతమవుతుందని తెలిపారు.ఈ విధానం ద్వారా వ్యవసాయం స్థిరంగా నిలవడమే కాకుండా రైతుల ఆర్థిక స్థితి కూడా మెరుగుపడుతుందని ఆయన వివరించారు.పంట రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతో పాటు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు జరుగుతుండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని, ప్రతి రైతు సమస్యకు త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబు రావు,ఏడిఏ లాల్ చంద్,వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ ఏ ఈ ఓ రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను వసతి గృహాలు దాటి పోనివ్వద్దు

(మొదటి పేజీ తరువాయి...)

గ్రామాలలో వరద నీరు రాక వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనుచున్నందున ఈపరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించాలని సంక్షేమాధికారులను పీవో రాహుల్ ఆదేశించారు. అలాగే పిల్లలు వర్షంలో తడిసి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున సంబంధిత ఏఎన్ఎం లను అందుబాటులో ఉంచుకొని సరిపడా మందులు దగ్గర పెట్టుకునేలా చూడాలని అన్నారు. తుఫాను ప్రభావం వలన ఏమైనా ఇన్స్టిట్యూషన్లు కూలిపోయే స్థితికి వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పిల్లలకు కాచి చల్లార్చిన గోరువెచ్చని మంచినీరుని ప్రతిరోజు తాగేలా చూడాలని పీవో ఆదేశించారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రతి స్థాయిలో అధికారులు ప్రజలతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. "ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగాఉందని , ఏ ఒక్కరికి ప్రాణ ,ఆస్తి నష్టం పశు నష్టం, పంట నష్టం జరగకుండా అధికారులు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని సీఎం జిల్లా కలెక్టర్లను వివిధ శాఖల అధికారులను సీఎం ఆదేశించారు , అదేవిధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలని,రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రమాదకర ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్ లు ఏర్పాటు చేయాలని, వాగులు, వంకల వద్ద ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అవసరమైనచోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని, అత్యవసర వైద్య సేవలను తక్షణం అందుబాటులో ఉంచాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించడమే కాక, డ్రోన్ల ద్వారా తాగునీరు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. వరంగల్ లో వరద బాధితులకు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ఎస్ డీఆర్ ఎఫ్ బృందాలను తక్షణం అక్కడికి తరలించాలని, హైడ్రా సిబ్బంది ,,సహాయక సామాగ్రిని వినియోగించి ప్రజలకు తక్షణ సాయం అందించాలన్నారు. సీఎంతో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని రుక్మిణి , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ నిత్య జీవితంలో భాగం కావాలి

(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ పేర్కొన్నారు. భారతీయ ఇతిహాసాలతోపాటు శతాబ్దాలుగా వస్తున్న వారసత్వ విలువల్లోనూ సత్య, ధర్మ మార్గంలో వెళ్లాల్సిన ఆవశ్యకతను ప్రబోధించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విజిలెన్స్ వారోత్సవాలను కేవలం వారం రోజులకు పరిమితం చేయకుండా అన్ని రోజులు కూడా నిబద్ధతతో పనిచేయాలన్నారు. నీతి, నిజాయతీ, పారదర్శకత పాటించడం వల్ల కష్టాలు మాత్రమే మిగులుతాయని, పనులు పూర్తి కావన్న అపనమ్మకాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతీ అంశాన్ని మానవీయ కోణంతో చూడాలన్నారు. నిజాయతీతో పనిచేయడం ద్వారా ఢిల్లీ మెట్రో రైలును సకాలంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలమని శ్రీధరన్ నిరూపించారని, సహకార రంగంలో పారదర్శకతను పాటించడం ద్వారా అమూల్ ద్వారా క్షీర విప్లవాన్ని సృష్టించిన కురియన్లు కూడా నైతిక విలువలకు గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. ఇలా ఎందరో వ్యక్తులు నిజాయతీతో సేవలు అందించి ప్రజల మన్ననలు అందుకున్నారని తెలిపారు. అదే సమయంలో నిజాయతీగా ఉంటూ పనులు చేయకపోవడం కూడా నేరమే అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పౌరులకు పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విజిలెన్స్ అంటే ప్రతీ ఒక్కరినీ నేరస్థులుగా చూడటం, నేరస్థులను పట్టుకోవడం కాదని, నేరం జరగకుండా, ఎవరూ నేరం చేయడానికి సిద్ధపడకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే విజిలెన్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నిజాయతీగా పనిచేసిన వారి గొప్పతనం గురించి సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఆత్మ సంతృప్తి కోసం అంతరాత్మను వంచించుకోకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించే అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ..సింగరేణి 136 ఏళ్ల ప్రస్తానంలో సాధించిన విజయాలను, సింగరేణి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపడుతున్న విస్తరణ ప్రణాళికలను, సింగరేణిలో మహిళా సాధికారత కోసం చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం శిఖా గోయల్ను ఘనంగా సన్మానించారు. సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, శ్రీ గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలతో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

- సీఐ బత్తుల సత్యనారాయణ

**టేకులపల్లి,అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** మత్తు పదార్థాలతో జీవితాలను చిత్తు చేసుకోకూడదని సీఐ బత్తుల సత్యనారాయణ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని టేకులపల్లి క్రాస్ రోడ్ సెంటర్ లో పోలీస్ అధికారులు ఆటో డ్రైవర్ లకు, గ్రామస్తులకు డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన కల్పిస్తున్న టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై ఆలకుంట రాజేందర్ గురువారం చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా బోడు క్రాస్ రోడ్ నందు గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రజలకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలను సేవిస్తే శారీరకంగా, మానసికంగా, కుటుంబ పరంగా, సమాజ పరంగా ఎదురయ్యే సమస్యలు, చట్టాల ద్వారా పడే శిక్షలను వివరించారు. అసాంఘిక కార్యకలాపాలు గానీ, వ్యక్తుల సమాచారం గానీ తెలిస్తే స్థానిక పోలీసులకు గానీ, 100 నంబర్కు డయల్ చేసి తెలుపాలన్నారు.జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పని




చేస్తున్న పోలీస్ శాఖకు ప్రజలంతా తెలిపారు. చుట్టుపక్కల మత్తు పదార్థాలను రవాణా చేసిన, క్రయవిక్రయాలు చేసిన వారి వివరాలను పోలీసువారికి తెలియజేసిన విషయాన్ని బయటకి రానీయకుండా గోప్యంగా ఉంచుతామని వారు తెలియజేశారు.ప్రజలు ఈ విధంగా మత్తు పదార్థాలను నిర్మూలించే విధంగా పోలీస్ వారికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ,ఎస్సైని కలిసిన ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీ

**టేకులపల్లి,అక్టోబర్30,ప్రజాజ్యోతి:** టేకులపల్లి గ్రామంలోని ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం టేకులపల్లి పోలీస్ స్టేషన్ సీఐ బత్తుల సత్యనారాయణను, ఎస్సై ఆలకుంట రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు కుంజా వీరభద్రం, సభ్యులు రమేష్,శంకర్, రవి, అప్పారావు, వెంకన్న, నరసింహారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఖాసీంకు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొజ్జా పవన్ సాయం




**బూర్గంపహాడ్, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి ):** బూర్గంపహాడ్ మండలం అంజనాపురం గ్రామంకు చెందిన ఎస్.కె ఖాసీం కి అనారోగ్యంతో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకుని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొజ్జ పవన్ కుమార్ పదివేల రూపాయలు మైనార్టీ కమిటీ సభ్యులు అందించగా ఆ నగదును వారు బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సహాయం అందించిన బొజ్జ పవన్ కుమార్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కారులో తరలిస్తున్న 24.9 కిలోల గంజాయి పట్టివేత

- వ్యక్తిపై కేసు నమోదు



**భద్రాచలం, అక్టోబర్ 30,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని ఆర్టీవో కార్యాలయ చెకోపోస్టు వద్ద ఓ కారులో తరలిస్తున్న 24.9 కిలోల ఎండు గంజాయితో పాటు ఒక 3. వ్యక్తిని భద్రాచలం ఎక్సైజు సీఐ రహీమున్నీసాబేగం అరెస్టు చేశారు. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో కారులో ఉన్న మహ్మద్ హుస్సేన్ వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు అతను ఉపయోగించిన మొబైల్ ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

## సాయి మందిరంలో కార్తీక మాస అన్న సమారాధన



**భద్రాచలం టౌన్, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి ):** భద్రాచలం పట్టణం లోని జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జరిపే విధంగా దివంగత కురిచేటి పాండురంగారావు కుమారులు కురిచేటి రామచంద్రమూర్తి, కురిచేటి శ్రీనివాసరావు, వారి కుమార్తె ఉప్పల శారద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలను ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు శాలువాతో సత్కరించి బాబా వారి చిత్రపటం అందించారు.సుమారు రెండువేల మంది భక్తులు బాబా వారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు బానిసైతే కుటుంబాలు వీధిన పడతాయి

- యువత ముందుకు వస్తే ప్రజల్లో మరింతగా చైతన్యం
- డ్రగ్స్ పై చైతన్యం యుద్ధం అవగాహన సదస్సులో భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్






**భద్రాచలం, అక్టోబర్ 30,ప్రజాజ్యోతి :** డ్రగ్స్ పై బానిసైతే మీతో పాటు మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాలు సైతం వీధిన పడటంతో ఆర్థిక సమస్యలను తరచూ ఎదుర్కోవలసి ఉంటుందని భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. పట్టణంలోని రెడ్డిసత్రంలో డ్రగ్స్ పై చైతన్య యుద్ధం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ కు అలవాటు పడితే అనేక సమాజంలో, కుటుంబంలో ఆనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ కు ఎంత దూరంగా ఉంటే వారి జీవితం అంత మంచిగా ఉంటుందని, ఒక వేళ అలవాటు పడితే అనేక ఇబ్బందులు పడాల్సి ఉంటుందని వివరించారు. డ్రగ్స్ కు బానిసైన వారు డీ అడిక్షన్ సెంటర్స్ ను ఆశ్రయించాలని, వైద్యుల సలహాలు తీసుకోవాలని కోరారు. అలాగే డ్రైవింగ్ వృత్తిలో ఉండే మరీ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, మీపై ఆధారపడి ఉండే కుటుంబంను దృష్టిలో ఉంచుకొని మత్తు పదార్ధాలకు దూరంగా ఉంటే మంచిదన్నారు. కర్నూలు బస్సు దుర్ఘటనే ఇందుకు ఉదాహరణ అని, ఒక వ్యక్తి మద్యం మత్తులో చేసిన నిర్లక్ష్యం వలన ఘోర – సంఘటన మన కళ్ల ముందే చోటు చేసుకుందన్నారు. లారీలు, బస్సులు, టాటా మ్యాజిక్ తదితర వాహనాలను నడిపే వారు డ్రగ్స్కు దూరంగా ఉండాలని, వారు కూడా ప్రజల్లో చైతన్యం కలిగించాలని కోరారు. అనంతరం డ్రగ్స్ పై చైతన్య యుద్ధం పోస్టర్లను ఎఎస్పీ విక్రాంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్సైలు రామకృష్ణ, శ్యామ్, తిరుపతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆబ్సెంట్ అవుతున్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు...

- సవరించిన సర్క్యులర్ ను జరిచేసిన సింగరేణి యాజమాన్యం



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 30 – ప్రజాజ్యోతి:** విధులకు గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు సవరించిన సర్క్యులర్ ను సింగరేణి యాజమాన్యం జరిచేసిందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ఏరియా లో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని మాట్లాడుతూ... సిఆర్పి/పిఈఆర్/ఐఆర్/డి /1252, తేదీ.23.10.2025 (క్రానిక్ అబ్సెంటీయిజం – ధీర్ఘకాలిక గైర్హాజరు) విధులకు గైరుహాజరు అవుతున్న ఉద్యోగులకు కంపెనీ ఉత్పత్తి, ఉథ్పాధకథను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం వారు భూగర్భ గని (అండర్గ్రౌండ్) లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రతి నెల 16 మస్టర్లు తగ్గకుండా, ఉపరితల గనులలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రతి నెల 20 మస్టర్లు తగ్గకుండా విధులకు హాజరు కావలసినదిగా సర్క్యులర్ నందు తెలియజేశారని అన్నారు. అలాగే ఇంతక పూర్వము కంపెనీ విధులకు గైరుహాజరు అవుతున్న ఉద్యోగులకు క్రమశిక్షణ చర్యలలో బాగంగా సంవత్సరకాలంలో (జనువరి నుండి డిసెంబర్ వరకు) 100 మస్టర్లు చేయని వారికి ఇచ్చు అభియోగపత్రము (చార్జిషీట్) లను ఇకమీదట 150 మస్టర్ల కన్నా తక్కువ మస్టర్లు చేసిన వారిని ధీర్ఘకాలిక గైర్హాజరు ఉద్యోగులుగా పరిగణించి క్రమశిక్షణ చర్యలలో బాగంగా అభియోగపత్రము (చార్జిషీట్) జారీచేసి కంపెనీ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇట్టి విధులకు గైరుహాజరు అవుతున్న ఉద్యోగులకు కంపెనీ ఉత్పత్తి, ఉత్పాధకతను విఘాతం కలిగించేవారిగా పరిగణించి యాజమాన్యం కఠినమైన చర్యలను తెసుకుంటుందని తెలియజేశారు. ఉద్యోగులందరు విధులకు సక్రమంగా హాజరవుతూ, కంపనీ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ కంపెనీ పూరోబివృద్ధికి తోడ్పడాలి అలాగే విధులకు దీర్ఘకాలిక గైర్హాజరు చేస్తున్న ఉద్యోగులను యాజమాన్యం వారు తీసుకున్న నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని సక్రమంగా విధులకు హాజరవుతూ వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను కూడా మెరుగుపరుచుకోవాల్సిందిగా జిఎం ఎం. షాలేం రాజు ఉద్యోగులందరికీ కోరారు.

## మావోయిస్టుల స్మారక చిహ్నాం కూల్చివేత





**చర్ల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ లో టార్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోటుంపల్లి గ్రామ అడవులలో మావోయిస్టులు నిర్మించిన స్మారక చిహ్నాన్ని భద్రతా దళాలు కూల్చివేశాయి. డి ఆర్ జి పోలీస్ స్టేషన్ టార్రెమ్, సి ఆర్ పీ ఎఫ్ –153 సి ఆర్ పీ ఎఫ్ –168 ల సంయుక్త ఆపరేషన్ లో మావోయిస్టులకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరంతర ప్రచారంలో భాగంగా బుధవారం టార్రెమ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో గోటుంపల్లి గ్రామంలో దట్టమైన అడవులలో మావోయిస్టులు నిర్మించిన 15 అడుగుల ఎత్తు గల స్మారక చిహ్నాన్ని పోలీసు దళం కనుగొంది దానిని భద్రతా దళాలు వెంటనే కూల్చివేశాయి. గ్రామస్తులలో భయానక వాతావరణాన్ని కొనసాగించడానికి వారి సంస్థను ప్రచారం చేయడానికి గ్రామస్తులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా మావోయిస్టులు ఈ స్మారక చిహ్నాన్ని నిర్మించారు అని అధికారులు అన్నారు . డి ఆర్ జి థానా టారెమ్, సి ఆర్ పీ ఎఫ్ – 153 సి ఆర్ పీ ఎఫ్ –168 ల సంయుక్త బృందం క్లిష్ట భౌగోళిక పరిస్థితులలో అత్యంత జాగ్రత్తగా ధైర్యంగా ఈ ఆపరేషన్ను విజయవంతంగా నిర్వహించింది. ఈ ఆపరేషన్ ఈ ప్రాంతంలోని మావోయిస్టుల నైతికతపై తీవ్ర ప్రభావాన్ని చూపింది అని గ్రామస్తులలో భద్రతా దళాలపై నమ్మకం భద్రత మరింత బలపడింది అని మావోయిస్టులపై ఇటువంటి ప్రభావవంతమైన ఆపరేషన్లను పోలీసులు భద్రతా దళాలు నిరంతరం నిర్వహిస్తున్నాయి అని భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆపరేషన్లు నిరంతరాయంగా కొనసాగుతాయి అని అధికారులు తెలియచేసారు .

## ఇరవెండి పంచాయితీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి

- -పంచాయతీ కార్యదర్శికి బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు వినతి



**బూర్గంపహాడ్, అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని ఇరవెండి పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి స్పందనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహంకాళి మాట్లాడుతూ డ్రైనేజీలు లేక వర్షం వస్తే మురుగు నీరు అంతా రోడ్లపై చేరుతుందని, రోడ్లు సైతం దెబ్బతింటున్నాయని తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆరోపించారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో గ్రామంలోని వివిధ కాలనీల ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారని, గ్రామీణ ప్రాంతం కావడంతో విష సర్పాలు, క్రిమి కీటకాలతో ప్రమాదం పొంచి ఉందని ఆ వినతిలో పేర్కొన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తక్కువ సమయం చేయడంతో ప్రజలకు తాగునీరు సరిపడ అందక ఇబ్బందులు పడుతున్నారని, ఎక్కువ సమయం నీటిని వదలాలన్నారు. గ్రామంలో క్రీడాకారుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడామైదానానికి వెళ్లడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని కోరారు. పంచాయతీలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నిత్యం శానిటేషన్ పనులు ముమ్మరంగా నిర్వహించాలని, గ్రామంలో అర్హత కలిగిన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించాలని ఆ వినతిలో కోరారు.

## చంద్రుగొండ మండల కేంద్రంలో సిసి పత్తి కొనుగోలు చేయాలి

- ప్రభుత్వాన్ని కోరిన రైతన్నలు





**అక్టోబర్ 30, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో మొంథా' తుఫాన్ పత్తి రైతులను నిండా ముంచేసింది. భారీ వర్షాలకు ఈదురుగాలులు తోడవడంతో పంటనష్టం మరింత పెరిగింది. మండలంలోని బెండలపాడు, బాలికుంట, రావికంపాడు, పోకలగూడెం, గానుగపాడు, మంగయ్య బంజర, వెంకటయ్య తాండ, తిప్పనపల్లి, రేపల్లెవాడ, తుంగారం, ప్రాంతాలలో వేల ఎకరాలలో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. తుఫాన్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో పత్తి నేలవాలిపోయింది. ఏకధాటిగా కురిసిన వర్షంతో రైతులు ఆశ వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కళ్ల ముందే పంట నాశనం అవుతుండడంతో రైతులు ఆవేదన చెందారు. కొన్ని చోట్ల పత్తి కాయలు పగిలి గుబ్బలు నలుపు రంగులోకి మారిఎంఎం మొలకలు వచ్చాయి. లక్షల రూపాయల్లో పెట్టుబడులు పెట్టి కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల పత్తి చేన్లు ఎరుపు రంగుకు మారగా, మరి కొన్నిచోట్ల పత్తి చేన్లు పూర్తిగా ఆకు రాలి ఎండిపోతున్నాయి. కావున ప్రభుత్వమే తమని ఆదుకోవాలని వేడుకుంటున్నారు. లేనిపక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తంచేశారు

# పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన ప్రేమ జంట

- అమ్మాయి బంధువులు ఆగ్రహం
- స్టేషన్లోకి వెళ్లేందుకు ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- పోలీస్ స్టేషన్ను చేరుకొన్న డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్.
- కొత్తగూడెం.చుంచుపల్లి చంద్రుగొండ పిఎస్ ల నుంచి వచ్చిన సిఐ లు ఎస్సైలు





**జూలూరుపాడు అక్టోబర్ 30 ప్రజా జ్యోతి:** జూలూరుపాడు మండల పరిధిలోని అన్నారు పాడుకు గ్రామానికి చెందిన అమ్మాయి జూలూరుపాడు కు చెందిన అబ్బాయి దేవాలయంలో పెళ్లి చేసుకొని జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. ఈ క్రమంలో అమ్మాయి తల్లిదండ్రులు కూతురు మిస్సయింది అనే విషయమై జూలుపాడు పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ క్రమంలో ప్రేమ జంటను గుర్తించిన పోలీసులు పోలీస్ స్టేషన్కు రప్పించారు ఈ క్రమంలో మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్కు వచ్చిన అమ్మాయి తల్లిదండ్రులు వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్లోకి చొచ్చుకుని వచ్చేందుకు ప్రయత్నం చేశారు తలుపులు కిటికీ డోర్లు తీసేందుకు ప్రయత్నం చేయగా పరిస్థితిని అర్థం చేసుకున్న ఎస్సై బాధావత్ రవి విషయాన్ని డీఎస్పీ రెహమాన్ కు వివరించారు రంగంలోకి దిగిన డిఎస్పి 20 నిమిషాల్లో జూలూరుపాడు పోలీస్ స్టేషన్ కు అదనపు బలగాలతో చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ వారిద్దరి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసామని చట్ట ప్రకారం మేజర్లైనందున వారి స్టేట్మెంట్ తీసుకొని వారి ఇష్ట ప్రకారం బయటికి పంపిస్తామని చెప్పారు. వారికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు . పోలీస్ స్టేషన్కు చుంచిపల్లి సీఐ వెంకటేశ్వర్లు. కొత్తగూడెం త్రీ టౌన్ సీఐ. సుజాతనగర్ ఎస్ఐ సంచుపల్లి ఎస్సై చంద్రు గుండా ఎస్ ఐ లు పాల్గొన్నారు.

## కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా ఉన్న ముద్దాయి అరెస్ట్



**కొత్తగూడెం, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):** 2013 సంవత్సరంలో సుజాతనగర్ మండలం జెండాల సెంటర్ ఏరియాకు చెందిన గడ్డం శ్రీనివాసరావు పై అటెంప్ట్ మర్డర్ కేసు సీర్.నె 126/2013 యూస్ 294(బి),307 ఐపీసీగా నమోదు కావడం జరిగింది.ఈ కేసులో గడ్డం శ్రీనివాసరావు కి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించగా ముద్దాయి గడ్డం శ్రీనివాసరావు బెయిలు పై జైలు నుండి విడుదలై కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా పోలీసువారికి దొరకకుండా తప్పించుకొని తిరుగుతూ ఉండడంతో కొత్తగూడెం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వారు ముద్దాయి శ్రీనివాసరావు పై అరెస్ట్ వారెంట్ జారీ చేయడం జరిగింది. కోర్టు వారి ఆదేశాలపై సుజాతనగర్ ఎస్ రమాదేవి తన సిబ్బందితో కలిసి ముద్దాయి గడ్డం శ్రీనివాసరావును అతని ఇంటి వద్ద పట్టుకొని అదుపులోకి తీసుకొని కొత్తగూడెం కోర్టు ముందు హాజరుపరచగా కొత్తగూడెం కోర్టు వారు అతనికి రిమాండ్ విధించగా, సుజాతనగర్ పోలీస్ వారు భద్రాచలం సబ్ జైలుకు తీసుకెళ్లి అప్పగించారు.

## పెద్దమ్మతల్లికి 108 సువర్ణ పుష్పాలతో వైభవోపేత పూజలు



**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాధపురం గ్రామంలోని శ్రీ కనక దుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో గురువారం సువర్ణ పుష్పార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీకుమారి ఆదేశాల మేరకు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించగా,అర్చకులు హారతి, మంత్రపుష్పం,నివేదన వంటి వైదిక కర్మలు శ్రద్ధగా జరిపారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అదే ఆలయ పరిసరాల్లో కార్తీకమాసోత్సవాల్లో భాగంగా నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో పంచామృతాభిషేకం,లక్ష బిల్వార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం హారతులు,నివేదన,నీరాజన, మంత్రపుష్పాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు చీకటి కార్తీక్,పెండ్లి రామిరెడ్డి,చెవుగాని పాపారావు, ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## టీజెన్కో ఉద్యోగులకు కోటి 20 లక్షల ప్రమాద బీమా

- హెచ్-142 యూనియన్ కృషికి ఫలితం



**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్–142) యూనియన్ కృషి ఫలితంగా టీజెన్కోలో పనిచేస్తున్న ఉద్యోగులు,ఆర్టిజన్లకు ఒక కోటి 20 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తింపులోకి వచ్చింది. అదేవిధంగా,సాధారణ మరణం సంభవించిన సందర్భంలో 10 లక్షల రూపాయల ఉచిత బీమా లభించనున్నది.యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.రామారావు ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు పలు మార్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులను కలిసి మెమొరాండాలు సమర్పించారు.ఈ క్రమంలో గురువారం హైదరాబాద్ లోని విద్యుత్ సౌదాలో టీజెన్కో డైరెక్టర్ (ఫైనాన్స్ & కమర్షియల్) జి.వీర మహేందర్ సాన్నిధ్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో చర్చలు జరిపి,మ్యూచువల్ ఆఫ్ అండర్స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకున్నారు.ఈ బీమా సదుపాయం ఉద్యోగులు,ఆర్టిజన్లకు వర్తించనుండగా,తమ యూనియన్ కృషికి ఫలితం దక్కిందని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.